TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి: 1 సంచిక: 100 | శుక్రవారం, ఆగస్టు 9, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు: 4

### లోక్‌సభలో వక్ఫ్ బిల్లు..


## హోరెత్తిన నిరసన



న్యూఢిల్లీ: దేశంలో వక్ఫ్ చట్టాల సవరణలకు సంబంధించిన కీలక బిల్లును కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ వక్ఫ్ (సవరణల ) బిల్లును, దీనితో పాటు ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ ) బిల్లు 2024ను సభ ముందుంచారు. వక్ఫ్ బిల్లులోని ఉద్ధేశాలపై ప్రతిపక్ష పార్టీల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ స్క్రూటినికి పంపిస్తున్నట్లు మంత్రి సభకు తెలిపారు. వక్ఫ్‌చట్టం పరిధిలో ఇప్పుడు నిర్వహణలో ఉన్న పలు వక్ఫ్‌బోర్డుల్లోని అధికారిక నిర్వహణ క్రమాన్ని సరిదిద్దడం, పాలక మండలిలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం వంటి కీలక ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయని వెల్లడి కావడంతో , ఇది ముందుగానే వివాదాస్పదం అయింది. ముస్లింల మతపరమైన వ్యవస్థలలో ప్రభుత్వ అనుచిత జోక్యం అవుతుందని ముస్లిం మతపెద్దలు, కొన్ని ప్రతిపక్ష పార్టీలూ విమర్శించాయి. బిల్లులోని అంశాలు తీవ్రస్థాయి పరిణామాలకే దారితీస్తాయని ఘాటైన హెచ్చరికలు కూడా వెలువడ్డాయి.

### కేజ్రీవాల్ కస్టడీ...

## మరోసారి పొడిగింపు




న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ మరోసారి ట్రయల్ కోర్టు పొడిగించింది. ఆగస్టు 20వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు నిర్ణయం తీసుకుంది. గురువారం కేజ్రీవాల్‌ను తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరుపరచగా.. కోర్టు రిమాండ్ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. లిక్కర్ పాలసీ కేసులో ఈడీ అధికారులు మార్చి 21న కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను తీహార్ జైలుకు తరలించారు. అనంతరం కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినా తిరస్కరణకు గురయ్యాయి. ఒకానొక సమయంలో మాత్రం ట్రయల్ కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. కానీ సీబీఐ రూపంలో ఆశలు గల్లంతయ్యాయి. దర్యాప్తు సంస్థ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లి అడ్డుకోవడంతో కేజ్రీవాల్ విడుదల నిలిచిపోయింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో మాత్రం ఎన్నికల ప్రచారం కోసం 21 రోజులు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం జూన్ 2న తీహార్ జైల్లో కేజ్రీవాల్ లొంగిపోయారు. అప్పటి నుంచి ఆయన జైల్లోనే ఉంటున్నారు.

### రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం

## గడువు పొడిగింపు

**- సీఎండీ ఎన్.బలరామ్**



సింగరేణి భవన్,: సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం గడువును ఈనెల 12 తేదీ వరకు పొడిగించినట్లు సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్ ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధిస్తే సింగరేణి తరఫున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా గత నెల 20వ తేదీన ఈ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 6వ తేదీ వరకు గడువు విధించడం జరిగింది. అయితే గడువు పొడగించాల్సిందిగా అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈనెల 12వ తేదీ వరకు పెంచినట్లు ఆయన తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సింగరేణి వెబ్సైట్ scclmines.comను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఆనాటి హీరోలు అడవులను కాపాడితే...

## ఈనాటి హీరోలు నరికేస్తున్నారు

బెంగళూరు : ఒకప్పటి హీరోలు అడవులను కాపాడేవారిగా నటించి మెప్పిస్తే... ఇప్పటి హీరోలు ఆ ఆడవులను నరికే వారిగా నటిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు పవర్ స్టార్, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... బెంగుళూరు పర్యటనలో ఉన్న ఆయన నేడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశారు..అనంతరం ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి ఖండ్రే భేటి అయ్యారు.. దీనికి ముందు అక్కడి మీడియాతో మాట్లాడుతూ, నిమాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం వస్తున్న సినిమాల్లో అడవులను నరికివేస్తున్నారని అన్నారు. నాకు చాలా నచ్చింది ఏంటి అంటే దివంగత కన్నడ నటుడు రాజ్ కుమార్ నటించిన చిత్రం గంధడగుడి. ఈ సినిమా థీమ్ ఏంటి అంటే అడవులను కాపాడడం. నాకు కూడా ఇలాంటి సినిమాల్లో నటించాలా అనిపించేది. ఇంతకుముందు సినిమాల్లో హీరోలు అడవులని కాపాడేవారు. కానీ ఈరోజుల్లో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం హీరోయిజం అయిపోయింది. నేను ఆ పరిశ్రమలో ఉన్నానని అప్పుడప్పుడు బాధగా అనిపిస్తుంటుంది. ఇలాంటివి తగ్గి మళ్లీ అడవుల ప్రాముఖ్యత తెలిసేలా సినిమాలు రావాలని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.





## ఉత్తమ్ ఛైర్మన్ గా కేబినెట్ సబ్ కమిటీ

హైదరాబాద్: కొత్త రేషన్ కార్డుల జారీ కోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది తెలంగాణ ప్రభుత్వం. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛైర్మన్ గా.. మంత్రులు దామోదర రాజానర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను సభ్యులుగా నియమిస్తూ సబ్ కమిటీ ఏర్పాటు.. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పరిశీలన జరిపి విధి విధానాలను సిఫారసు చేయనుంది ఈ కమిటీ.

## 10న వయనాడ్‌కు ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: వయనాడ్‌లోని కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 10న సందర్శిస్తారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం తెలిపారు. బాధితుల పునరావాసం కోసం కేంద్ర సహాయాన్ని సమకూర్చే విషయంలో ప్రధాని మోడీ సానుకూల వైఖరి తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. వయనాడ్ దుర్ఘటనను జాతీయ విపత్తుగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థిస్తున్న విషయాన్ని విలేకరుల సమావేశంలో విజయన్ ప్రస్తావించారు. శనివారం జరగనున్న ప్రధాని పర్యటనలో సానుకూల పర్యటన రావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను పురస్కరించుకుని వయనాడ్ దుర్ఘటన తీవ్రతను అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు కేంద్ర హోం శాఖ 9 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. కేంద్రం నుంచి సమగ్ర పునరావాస ప్యాకేజీ రావచ్చని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి



సహకారం, సహాయం అందుతున్నాయని ఆయన చెప్పారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలలో లభించిన శరీర భాగాలు, గుర్తు తెలియని మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే మృతుల సంఖ్యపై కచ్చితమైన సమాచారం లభించగలదని ఒక ప్రశ్నకు జవాబుగా ఆయన తెలిపారు.

### కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు...

## రూ. కోటి చెక్ ఇచ్చిన చిరంజీవి

**వాయనాడ్:** కేరళలోని వాయనాడ్ లో కొండచరియలు విరిగిపడటంతో దాదాపు 400 మంది కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు..మరోవైపు, బాధితులను రక్షించడం, పునరావాసం కోసం పలువురు ప్రముఖులు ఉదారంగా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి గురువారం నాడు కేరళ రాజధాని తిరువనంతపురంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సమావేశమయ్యారు మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ కలిసి కేరళ లోని వయనాడ్ బాధితులకు ఆర్థికసాయం ప్రకటించిన సంగతి మనకి తెలిసిందే. ఈ మేరకు చిరంజీవి గురువారం ప్రత్యేక విమానంలో కేరళకు వెళ్లారు. సీఎం పినరయి విజయన్‌ను కలిశారు. రూ.కోటి విరాళం చెక్‌ను సీఎంకు అందించారు.



## తెలంగాణలో కార్నింగ్



హైదరాబాద్ : ప్రపంచంలో పేరొంది న కార్నింగ్ ఇన్ కార్పొరేటేడ్ కంపెనీ తెలంగాణలో కొత్త ఆవిష్కరణల అభివృద్ధికి ముందుకు వచ్చింది. నైపుణ్యాలతో పాటు పరిశ్రమల్లో సాంకేతిక ఆవిష్కరణలను అభివృ ద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఎమర్జింగ్ ఇన్నేవేషన్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోనాడ్ వెర్క్మీరన్ అధ్వర్యంలోని కార్నింగ్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధికారికంగా అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో కార్నింగ్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వానికి పరస్పర సహకారం అందిస్తుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలలో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంతో భాగస్వామ్యం పంచుకుంటుంది. తెలంగాణలో ఫార్మాస్యూటికల్ గ్లాస్ ట్యూబ్ తయారీ కేంద్రం నెలకొల్పటంపై కార్నింగ్ కంపెనీ ప్రతినిధులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. 2025 నుంచి ఇందులో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమిస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ యూనివర్సిటీ సహకారంతో డాక్టర్ రెడ్డీస్ లిమిటెడ్, లారస్ ఫార్మా లిమిటెడ్ నిర్వహిస్తున్న ఫ్లో కెమిస్ట్రీ టెక్నాలజీ (ఎఫ్‌సిటి) హబ్‌లోనూ కార్నింగ్ కంపెనీ భాగస్వామ్యం పంచుకుంటుంది. ఫార్మాస్యూటికల్ మరియు కెమికల్ పరిశ్రమలలో ఆవిష్కరణలతో పాటు ఫ్లో కెమి స్ట్రీ టెక్నాలజీలో ఈ కంపెనీ తగిన సహకారం అందిస్తుం ది. కొత్తగా అందుబాటులోకి తెస్తున్న అడ్వాన్స్‌డ్ ఫ్లో రి యాక్టర్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కంపెనీ ప్రతినిధులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ అత్యాధునిక గ్లాస్ ట్యూబ్ తయారీ కేంద్రం ఫార్మా రంగం అభివృద్ధికి దోహదపడుతుంది. ఔషధాల ప్యాకేజింగ్ పరిశ్రమలో ఈ గ్లాస్ ట్యూబ్ లను ఉపయోగిస్తారు. వీటి తయారీకి వినూత్నమైన వెలాసిటీ గ్లాస్–కోటింగ్ టెక్నాలజీని ఈ కంపెనీ వినియోగిస్తోంది. ఈ కొత్త సదుపాయంతో తెలంగాణలో ఇప్పటికే వేగంగా విస్తరిస్తున్న ఫార్మాస్యూటికల్ రంగంలో ఉత్పాదకత సామర్థ్యం మరింత మెరుగుపడుతుందనే అంచనాలున్నాయి.

# ముందుకు సాగని డిండి పనులు



**మహబూబ్ నగర్ :** డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ముందుకు కదలటం లేదు .ఇప్పటికీ డీపీఆర్ సిద్ధం కాలేని పరిస్థితి ఉంది. మరోవైపు ఎత్తిపోతల నీటి కోసం మూడు జిల్లాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. త్వరితగతిన ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే తమ ప్రాంతమంతూ సస్యశ్యామలంగా మారుతుందని భావిస్తున్నారు.మూడు జిల్లాలు.., ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. 21 మండలాలు.. 3.61లక్షల ఎకరాల ఆయకట్టు.. వందలాది గ్రామాలకు తాగునీరు అందివ్వాల్సిన డిండి ఎత్తిపోతల పథకం రైతుల సహనానికి పరీక్ష పెడుతోంది. రూ.6190 కోట్ల అంచనా వ్యయంతో 2015 లోనే ప్రభుత్వ అనుమతులు ఇచ్చిన డిండి ఎత్తిపోతల పథకానికి ఇప్పటికీ డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధం కాలేదంటే ఈ ప్రాజెక్టు నిర్మాణంపై పాలకుల చిత్తశుద్ధి తెలిసిపోతుంది.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని దేవరకొండ, మునుగోడు, నాగార్జున సాగర్, నల్గొండ, నకిరేకల్ .. ఏడు నియోజకవర్గాల పరిధిలో 3.61 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టు విషయంలో తాత్సారం జరుగుతోంది. 2015 జూన్ 11వ తేదీన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం జీవో 107ను విడుదల చేసింది.ఒక్క నల్గొండ జిల్లా పరిధిలోనే ఈ పారజెక్టు 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాల్లోని ఫ్లోరైడ్పీ డితులకు తాగునీటిని అందించాల్సి ఉంది. ఉత్తర్వులు వెలువడి తొమ్మిదేళ్లు కావొస్తున్నా ఈ ప్రాజెక్టుకు నీటిని ఎక్కడి నుంచి ఇస్తారో ఇంకా తేల్చకుండానే రిజర్వాయర్లు మాత్రం నిర్మిస్తున్నారు. వీటి కింద డిస్టిబ్యూటరీలు, ఫీల్డ్ చానల్స్ నిర్మాణానికి భూసేకరణ కూడా జరపలేదు.పాలమూరు ? రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న డిండి ఎత్తిపోతల విషయాన్న గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. మహబూబ్ నగర్ ? నల్గొండ జిల్లాల మధ్య సాగునీటి పంపకాల వివాదం పాలమూరు ? రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2015 జూన్ 10వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అమరుసటి రోజే డిండి ఎత్తిపోతల పథకానికి ప్రత్యేక జీవో (జీఓ నెంబర్ 107) విడుదల చేసింది. పాలమూరు ? రంగారెడ్డి ఎత్తిపోతలను రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో, 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరి ఇచ్చేలా రూపొందించారు.ఈ ప్రాజెక్టు పనులను శరవేగంగా మొదలు పెట్టి పూర్తి దశకు తీసుకువచ్చిన ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకం విషయంలో మహబూబ్ నగర్ జిల్లా నాయకుల ఒత్తిడితో పక్కన పడేసిందన్న విమర్శలు ఎదుర్కొంటోంది. వాస్తవానికి డిండి ఎత్తిపోతలకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఇస్తానన్నది కేవలం 0.5 టీఎంసీ ( అర టీఎంసీ ) మాత్రమే. శ్రీశైలం బ్యాక్ వాటర్ లో నార్లాపూర్ జర్వాయర్ నుంచి 60 వరద రోజుల్లో (ఫ్లడ్ డేస్ ) 30 టీఎంసీల నీరు తీసుకోవాల్సి ఉంది. నల్గొండ జిల్లాకు ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ద్వారా తీసుకునే క్రష్ణా నీరు సరిపోతుందని, తమ ప్రాజెక్టు నుంచి అర టీఎంసీ ఎలా కేటాయిస్తారని మహబూబ్ నగర్ నాయకులు అడ్డుపడడంతో ప్రాజెక్టు నిర్మాణం ప్రమాదంలో పడింది.ఈలోగా తెలంగాణ సాగునీటి రంగ నిపుణుడు ఆర్.విద్యాసాగర్రావు పేరును డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రభుత్వం పెట్టింది. అసలు ఎక్కడి నుంచి ఎంత మేర నీరు తీసుకుంటారో తేల్చకుండా, డీపీఆర్ పూర్తి చేయకుండానే, డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం(చర్లగూడెం) మొత్తం అయిదు చోట రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టింది.ఇందులో కనీసం డెబ్బై శాతం పనులు పూర్తి కావొచ్చాయి. కానీ, వీటి కింద డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్ నల్స్ కోసం ఇంకా భూ సేకరణ కూడా చేపట్ట లేదు. పాలమూరు ? రంగారెడ్డి ఎత్తిపోతల పథకాని 2024 బడ్జెట్ లో రూ.300 కోట్లు కేటాయించారు. అయితే, ఇందులో అంతర్భాగంగా ఉన్న డిండి ఎత్తిపోతల పథకానికి ఎంత మొత్తంలో కేటాయించన్న విషయం ప్రకటించలేదు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఉల్పర నుంచి చివరి రిజర్వాయరు మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం వరకు 66 కిలో మీటర్ల నిడివిలో ప్రధాన కాల్వలు తవ్వాల్సి ఉంది. ఇందులోని కొన్ని చోట్ల చిన్న చిన్న సొరంగాలు కూడా అవసరం పడుతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లాలోని ఏదుల నుంచి నీరు తీసుకుంటారా..? ఉల్పర నుంచి డ్రా చేస్తారా అన్న విషయంలో స్పష్టత లేదు.

# భారీగా పెరగనున్న మద్యం ధరలు

**హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం అమ్మకాలు గడిచిన పదేళ్లలో ఏ ఏడుకాయేడు రికార్డులను తిరగరాస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కూడా లేనంతగా అమ్మకాలు సాగుతున్నాయి. దేశంలోనే తెలంగాణ మద్యం అమ్మకాల్లో రెండో స్థానంలో నిలిచింది అంటే ఏమేరకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చుకుంది. జనంతో వీలైనంత ఎక్కువ మద్యం తాగించేందుకు బెల్టు షాపులను ప్రోత్సహించింది. ఎక్సైజ్ శాఖకు టార్గెట్ విధించి మరీ మద్యం అమ్మకాలు సాగించింది. ఇక మద్యం షాపుల లైసెన్స్ ఫీజులను భారీగా పెంచింది. మూడు నాలుగుసార్లు మద్యం ధరలను కూడా పెంచింది. ఇలా మద్యంతో కోట్ల రూపాయలు ఖాజానాకు కూడబెట్టింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కూడా అదే బాటలో పయనిస్తోంది. తాము అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులు ఎత్తేస్తామన్న రేవంత్‌రెడ్డి.. ఏడు నెలలు గడిచినా ఒక్క బెల్ట్ షాపును ముట్టుకోలేదు. మద్యం అమ్మకాలపై ఎలాంటి నియంత్రణ విధించలేదు. ఎంత తాగితే అంత తాగించండి అన్నట్లుగా సైలెంట్‌గా ఉండిపోయారు. వేసవిలో బీర్ల కొరత తీర్చేందుకు కొత్త బీర్ల తయారీ కంపెనీలకు అనుమతులు కూడా ఇచ్చారు. ఇలా మద్యపానాన్ని తనవంతుగా ప్రోత్సహిస్తోంది కాంగ్రెస్ సర్కార్. రోజురోజుకు లిక్కర్ అమ్మకాలు జోరుగా పెరిగిపోతున్నాయి. అయితే ధర ఎంత ఉన్నా అమ్మకాలు మాత్రం ఆగవు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రంలో బీర్ల ధరలు పెంచాలనే ఆలోచేన చేస్తున్నట్లు తెలుస్తోంది.బ్రూవరీలు ప్రస్తుతం బీర్ల ధరలు గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వానికి విన్నవించాయి. 10 నుంచి 12 శాతం ఎంచాలని ప్రతిపాదించాయి. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో బీర్ల అమ్మకాలు కూడా తగ్గాయి. ఈ నేపథ్యంలో ధరల పెంపునకు ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం అన్నట్లుగా బ్రూవరీలు ఎదురు చూస్తున్నాయి.ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఆరు బ్రూవరీల్లో ఏటా 68 కోట్ల లీటర్ల బీరు తయారు చేస్తున్నాయి. ఆ బీరును తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కొనుగోలుచేసి.. మద్యం దుకాణాలకు



సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో 12 బీర్ల కేసుకుగాను బ్రూవరీలకు బేవరేజెస్ కార్పొరేషన్ రూ.289 చెల్లిస్తోంది. పన్నులన్నీ కలుపుకొని కేసుకు రూ.1,400 చొప్పున రిటైలర్లకు (మద్యం దుకాణాలు) విక్రయిస్తుండగా.. ఇతర ఖర్చులన్నీ కలిపి మద్యం దుకాణాలవారులు కేసు రూ.1,800 చొప్పున విక్రయిస్తున్నారు. అంటే ఒక్కో బీరుకు ప్రభుత్వం బ్రూవరీల నుంచి కేవలం రూ.24.08కి కొనుగోలు చేస్తుంది. మద్యం షాపులకు ఒక్కో బీరును రూ.116.66 ధరకు అమ్ముతుంది. వినియోగదారు నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో బీర్ల డిమాండ్‌కు తగ్గట్టు ప్రభుత్వ ఆర్డర్లపై బ్రూవరీలు బీర్లను ఉత్పత్తి చేస్తాయి.ఇక బీర్ల ధరలపై ప్రభుత్వం, బ్రూవరీలు రెండేళ్లకోసారి ఒప్పందం కుదుర్చుకుంటాయి. గడువు పూర్తయ్యాక ధరలను సవరిస్తాయి. ప్రతి రెండేళ్లకూ బ్రూవరీలకు చెల్లించే ధరను ప్రభుత్వం దాదాపు 10 శాతం మేర పెంచుతూ ఉంటుంది. చివరిసారిగా 2022 మేలో 6 శాతంచొప్పున రెండుసార్లు పెంచింది. నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈసారి 20?25 శాతం పెంచాలంటూ బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ మేర పెంచినట్లయితే ధరలను పెంచాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్రభావం మందుబాబుపై పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 10 నుంచి 12 శాతం పెంపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. ధరలు పెంచాలని నిర్ణయిస్తే కేవలం బీర్లపైనే ఉండనుంది. మిగతా వాటి ధరలు అలాగే ఉండనున్నట్లు తెలుస్తోంది

# వక్ఫ్ చట్టంలో మార్పులు

**న్యూఢిల్లీ :** త్వరలో వక్ఫ్ చట్టంలో మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బోర్డు అధికారాలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆస్తిని వక్ఫ్ బోర్డు స్వంత ఆస్తిగా పిలవడానికి తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలు బిల్లులో ప్రతిపాదించే అవకాశం ఉంది.కేంద్ర ప్రభుత్వం త్వరలో వక్ఫ్ చట్టంలో అనేక భారీ మార్పులు చేయనుంది. ప్రభుత్వం వచ్చే వారం పార్లమెంటులో దీని కోసం బిల్లును తీసుకురావచ్చు. అందులో అనేక సవరణలు చేయవచ్చు అని జాతీయ మీడియా కథనలు ప్రచురించాయి. దీని ప్రకారం వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించవచ్చు. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆస్తిని స్వంత ఆస్తిగా పిలవడానికి దాని 'నియంత్రిత' అధికారాలను తగ్గించవచ్చు, మహిళల ప్రాతినిధ్యాన్ని కూడా నిర్ధారించవచ్చు. ఈ బిల్లులో వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలు ప్రతిపాదించే అవకాశం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లుకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సంబంధిత వర్గాల నుంచి సమాచారం. ఈ బిల్లు చట్టంలోని కొన్ని సెక్షన్లను రద్దు చేయాలని ప్రతిపాదించింది. దీని ప్రధాన లక్ష్యం వక్ఫ్ బోర్డుల వద్ద ఉన్న ఏకపక్ష అధికారాలను తగ్గించడం.ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం బోర్డు అధికారాలను చాలా వరకు తగ్గించాలనుకుంటోంది. బోర్డు అంతటా మరింత పారదర్శక ప్రక్రియను నిర్ధారించడానికి బిల్లు తప్పనిసరి అని కొంతమంది అంటున్నారు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు వక్ఫ్ బోర్డుల నిర్మాణం, పనితీరులో మార్పులు చేసేందుకు సెక్షన్ 9, సెక్షన్ 14లను సవరించవచ్చు.వివాదాలను పరిష్కరించడానికి, వక్ఫ్ బోర్డులు క్లెయిమ్ చేసిన ఆస్తులపై క్లారిటీ వచ్చేందుకు ఈ సవరణ ఉపయోగపడుతుందని కొందరు అంటున్నారు. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణలో మేజిస్ట్రేట్‌లు పాల్గొనవచ్చు. ప్రస్తుత చట్టాలను మార్చాలనే డిమాండ్ ముస్లిం మేధావులు, మహిళలు, షియాలు, బోహ్రాస్ వంటి వివిధ వర్గాల నుండి వచ్చిందని కొందరు చెప్పే మాట. దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డుల కింద సుమారు 8 లక్షల 70 వేల ఆస్తులు ఉండగా, ఈ ఆస్తుల కింద మొత్తం భూమి దాదాపు 9 లక్షల 40 వేల ఎకరాలు ఉంది.వక్ఫ్ చట్టం 1995లో రూపొందించారు. వక్ఫ్ బోర్డు.. విరాళంగా వచ్చిన, అంతేగాకుండా నోటిపై చేసిన ఆస్తులను నియంత్రిస్తుంది. వక్ఫ్ బోర్డు కొన్నిసార్లు వాదనలు చేసిన తర్వాత వివాదాలు అయ్యాయి. ఉదాహరణకు సెప్టెంబరు 2022లో తమిళనాడు వక్ఫ్ బోర్డు మొత్తం తిరుచెందురై గ్రామం యాజమాన్యాన్ని క్లెయిమ్ చేసింది. అయితే ఇక్కడ చాలా మంది హిందూ జనాభా శతాబ్దాలుగా నివసిస్తున్నారు.

# కేసీఆర్ వ్యూహం ఏమిటో

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర చాలా కీలకం? పదేళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్? గత ఎన్నికల్లో ఓటమి తర్వాత కేవలం పార్టీ కార్యక్రమాలకు? తన ఫాం హౌస్‌కు మాత్రమే పరిమితమయ్యారనే వాదన ఉంది. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు అస్సలు హాజరుకావడం లేదు. ప్రస్తుత సభ కొలువుదీరిన తర్వాత ఈ 8 నెలల కాలంలో కేవలం రెండు సార్లు మాత్రమే శాసనసభలో అడుగుపెట్టారు కేసీఆర్. అందులోనూ ఒకసారి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడానికి అసెంబ్లీకి రాగా, గత వారం జరిగిన బడ్జెట్ సమావేశాలకు మరోసారి వచ్చారు కేసీఆర్.సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాకపోవడంపై పొలిటికల్ సర్కిల్స్‌లో రకరకాల ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు పదేపదే కేసీఆర్‌ను సభకు రప్పించాలని కవ్వించేలా విమర్శలు చేస్తున్నా.. ఆయన మాత్రం చలించలేదు. మరోవైపు కేసీఆర్ సభకు రావాల్సిన పని లేదని, ఆయన బదులుగా తాము సరిపోతామని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చెప్పుకుంటూ వస్తున్నారు. ఐతే తాను అసెంబ్లీలో అడుగుపెట్టకపోవడానికి కారణమేంటనేది ఇంతవరకు ఎక్కడా చెప్పలేదు కేసీఆర్. ఇక తాజాగా ఆయనను కలిసిన బీఆర్ఎస్ సభ్యుల వద్ద తాను అసెంబ్లీకి హాజరుకాకపోవడానికి అసలు కారణమేంటన్నది చెప్పారట. తాను పూర్తిగా అసెంబ్లీని బహిష్కరించలేదని? త్వరలోనే మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతానని తనను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వివరించారట మాజీ సీఎం కేసీఆర్?.పదేళ్లు సీఎంగా పనిచేసిన తనను అవమానించేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్న కేసీఆర్?. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు తీరును బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వద్ద ప్రస్తావించారని అంటున్నారు. అధికారంలోకి రాడానికి ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్? చేతులెత్తేస్తోందని? ఆ విషయంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు తనను టార్గెట్‌గా విమర్శలు చేస్తుందని వివరించారట కేసీఆర్. కాంగ్రెస్ గ్యారెంటీ హామీలపై ప్రజల్లోనే తేల్చుకోవాలనే ఆలోచనతో తాను పక్కా వ్యూహం సిద్ధం చేశానని? తన వ్యూహం ప్రకారం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని? ఆ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే ప్రజల్లోనే తేల్చుకునే అవకాశం వస్తుందని చెప్పారట కేసీఆర్.బడ్జెట్ సమావేశాల సందర్భంగా అధికార పక్షంతో బాగా పోరాడారని తనను కలిసిన ఎమ్మెల్యేలను అభినందించిన కేసీఆర్? సీఎం రేవంత్‌రెడ్డితో తాడోపేడో అన్నట్లు తలపడిన మాజీ



మంత్రి సబితా ఇంద్రారెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడినట్లు చెబుతున్నారు. తనను పదే పదే సభకు రావాలంటూ రేవంత్ పిలవడం వెనుక వ్యూహాన్ని కూడా సదరు ఎమ్మెల్యేలకు కేసీఆర్ వివరించారట. తాను సభకు వస్తే టార్గెట్ చేసి విమర్శలు చేయడమో లేదా తనతో వాగ్వాదానికి దిగడం ద్వారానో ప్రజల్లో తన ఇమేజీని తగ్గించడమే రేవంత్ వ్యూహమని తేల్చారట కేసీఆర్. ఓ వైపు తనను సభకు రావాలని కోరుతూనే? మరో వైపు హాఫ్, ఫుల్ అంటూ రేవంత్ మాట్లాడ్డం ఏంటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారంటున్నారు.మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలతోనే బూతులు మాట్లాడించడం రేవంత్ వ్యూహంలో భాగమేనని.. దీనికి దీటుగా స్పందించిన ఎమ్మెల్యేలను ఆయన అభినందించినట్లు తెలుస్తోంది. ఇక ఈ సందర్భంగానే రాష్ట్రంలో ఉప ఎన్నికల ప్రస్తావన వచ్చిందని చెబుతున్నారు. ఉప ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారతాయని? ఆ తర్వాత తాను అసెంబ్లీకి వస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చెప్పారట కేసీఆర్. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై ఎట్టిపరిస్థితుల్లో అనర్హత వేటు పడుతుందని అంచనా వేస్తున్న బీఆర్ఎస్ బాస్? ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ ఆలస్యం చేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.సుప్రీంకోర్టు ఈ తరహా కేసులపై ఆయా రాష్ట్రాలకు కొన్ని సూచనలు చేసిందని? ఆ ప్రకారం కనీసం మూడు నెలల్లోగా ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆ స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో ప్రభుత్వంతో చావోరేవో తేల్చుకుంటానని? ఆ తర్వాతే సభకు వస్తానని ఎమ్మెల్యేలకు చెప్పారట బీఆర్ఎస్ బాస్. మొత్తానికి తాను సభలో అడుగుపెట్టాలంటే భారీ విజయం సాధించి?. ప్రజల్లో తన పట్టు సడలలేదని నిరూపించుకోవాలని కేసీఆర్ డిసైడయ్యారని అంటున్నారు పరిశీలకులు.


# పని ఒత్తిడిలో పోలీస్



**హైదరాబాద్ :** స్టేట్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ ఉద్యోగం చేయాలంటే సంబరపడే రోజులు మాయమైపోయాంటున్నారు సిటీ పోలీసులు. ఇటీవల కాలంలో పెరిగిన పని ఒత్తిడితో హైదరాబాద్ కమిషనరేట్‌లో పని చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇటీవల సిటీ పోలీసింగ్‌లో వచ్చిన మార్పులతో హైదరాబాద్‌లో పోస్టింగ్ అంటేనే పోలీసులు భయపడిపోతున్నారంటున్నారు. సిటీ పోలీసింగ్ అంటే సవాళ్లతో సహవాసంగా మారుతుండమే ఎక్కువ మంది ఇంట్రెస్ట్ చూపడం లేదని చెబుతున్నారు. శాంతిభద్రతల నిర్వహణతో పాటు కేసుల దర్యాప్తు, గస్తీ విధులు, ప్రముఖుల పర్యటనల్లో బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో 24 గంటలూ డ్యూటీలు చేయాల్సి రావడంతో సిటీ పోలీసులపై పని ఒత్తిడి బాగా పెరిగిపోతోంది. దీనికి తగ్గట్టు సిబ్బందిని పెంచకపోవడం, పని చేసిన వారిని టార్గెట్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో చాలామంది పోలీసులు సిటీలో విధులంటేనే జంకుతున్నారని చెబుతున్నారు.ఒకప్పుడు హైదరాబాద్‌లో విధులంటే పోలీసులు పోటాపోటీగా ముందుకు వచ్చే వారని చెబుతున్నారు. సిటీలో పోస్టింగ్ కోసం ఎన్నో పైరవీలు చేసేవారు. కోరుకున్న పోస్టింగ్‌లకు కాసులు కూడా సమర్పించుకునే వారు. కానీ, ప్రస్తుతం పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చిందంటున్నారు. కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తామంటున్నా? ఎస్ఐలు, సీఐలు మాకొద్దు బాబోయ్ అంటూ దండం పెట్టేస్తున్నారట.. ముఖ్యంగా గత మూడేళ్ల నుంచి ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. సిబ్బంది సామర్థ్యం, స్థితిగతులను పట్టించుకోకుండా 24 గంటలూ అందుబాటులో ఉండాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో చాలా మంది పోలీసులు మానసికంగా కుంగిపోతున్నారని చెబుతున్నారు.నగరంలో ఏడు జోన్లు ఉండగా, కొన్నిచోట్ల తీవ్ర పని ఒత్తిడి ఉంటోందంటున్నారు. ముఖ్యంగా సెంట్రల్, వెస్ట్, సౌత్ జోన్లలో స్టేషన్ హౌస్ అఫీసర్ నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. క్షణం కూడా ఖాళీ లేకుండా 24 గంటలూ డ్యూటీలు చేయాల్సి వస్తోందని ఆయా ఏరియాల్లో పని చేస్తున్న పోలీసులు వాపోతున్నారు. ఎప్పుడు? ఎక్కడ.. డ్యూటీ వేస్తారో తెలియక తీవ్రంగా సతమతమవుతున్నారని చెబుతున్నారు. వెస్ట్ జోన్‌లో వీఐపీ మూమెంట్ ఎక్కువగా ఉండడంతో ప్రతి చిన్న విషయాన్ని పైస్థాయి అధికారులు భూతద్దంలో పెట్టి చూస్తున్నారని చెబుతున్నారు. ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్ట్, డైలీ క్రైమ్ రిపోర్ట్, పెండింగ్ కేసులపై సమీక్షలు అంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచుతుండటం వల్ల క్షేత్రస్థాయి సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారంటున్నారు.

# భారీగా పట్టుబడుతున్న గంజాయి

**హైదరాబాద్ :** హైదరాబాద్ లో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ఈ గంజాయిని గుర్తించారు. దాదాపు 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఎస్వోటీ, శంషాబాద్ పోలీసులు కలిసి ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.94 కోట్ల విలువ ఉంటుందని పోలీసులు చెప్పారు. 800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు.ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి, హోల్లప్ప, సప్లయర్ సునీల్ ఖోస్లా, జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాకు మూలకారకులైన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇతను చాలా పెద్ద మొత్తంలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడని పోలీసులు చెప్పారు. కమీషన్ ఎజెంట్ కం ట్రాన్స్‌పోర్టర్ గా ఒడిశాకి చెందిన సోమ్ నాథ్ ఖారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాము అనే వ్యక్తి గతంలో గంజాయి రవాణా చేస్తూ అరెస్ట్ అయ్యాడు. మెయిన్ పెడ్లర్ కం రిసీవర్ సురేష్ మారుతి పాటిల్ కూడా పరారీలో ఉన్నాడు. "ఇలా గంజాయి ట్రాన్స్‌పోర్ట్ చేసినందుకు ప్రతిసారి రూ.2 లక్షలు రూపాయలు తీసుకుంటారు. నిందితులు అంతా కలిసి ఎంతకాలంగా గంజాయి సప్లై చేస్తున్నారో విచారిస్తున్నాం. ప్రధాన నిందితుడు రాముతో పాటు సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీస్ నిఘా తప్పించుకోవడానికి కంటైనర్ ముందు నిందితులు కార్ లో ఎస్కార్ట్




గా వచ్చారు. కంటైనర్ కు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండి ఎక్కడైనా పోలీసుల తనిఖీలు ఉంటే అప్రమత్తం చేస్తారు. పోలీసుల నిఘానుండే తప్పించుకోవడానికి టోల్గేట్ వద్దకు కంటైనర్ రాంగానే వాహనం నంబర్ ప్లేట్ మారుస్తారు. నిందితులపై అనుమానంతో 15 నుండి 25 రోజులు వరకు ఈ కేసు పై వర్కౌట్ చేసాం. నిందితులు ఒరిస్సా నుండి గంజాయి తీసుకువచ్చి పటాన్చెరువు వద్ద మరొక వెహికల్ లో గంజాయిని మారుస్తారు. మార్చిన ఆ వెహికల్ లో గంజాయిని మహారాష్ట్రకు తీసుకువెళ్తారు.విట్టల్ రెడ్డి పరవాడ సెజ్ లో సాల్వెంట్ డ్రమ్ములను కంటైనర్ లోడ్ చేసుకున్నాడు. కంటైనర్ ముందు భాగంలో సాల్వెంట్ డ్రమ్స్ పెట్టి వెనకాల భాగంలో గంజాయి ఉంచారు. కెమికల్స్ డ్రమ్ములను కూడా జిఎస్టి వేబిలు లేకుండా తరలిస్తున్నారు. ఆ కెమికల్ సాల్వెంట్స్ ఏంటి అన్న అంశంపై కూడా విచారణ చేస్తాం. మొత్తం ఏడుగురు నిందితులు గంజాయి సప్లై లో భాగంగా ఉన్నారు..ఇందులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసాం. మిగతా ముగ్గురు నిందితులను పరారీలో ఉన్నారు..వారిని వీలైనంత త్వరగా పట్టుకుంటాం" అని పోలీసులు అన్నారు.

## సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 9, 2024

# హసీనా రాజీనామా నేపథ్యం...!

చిలికి చిలికి గాలి వానగా మారినట్లు, గోరుతో పోయే స్థితులను గొడ్డలి దాకా తెచ్చుకున్నట్లుగా ఉంది నేటి బంగ్లాదేశ్ పరిస్థితి. చిన్న నిరసనలతో మొదలై దేశ ప్రధాని రాజీనామా చేసే వరకు హింసాత్మక పరిస్థితులు దిగజారాయి. ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రాణాలు నిలుపుకోవడానికి దేశాన్ని వదిలి పారి పోయినట్లు తాజా సమాచారం. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా (17.5 కోట్లు) కలిగిన 10 దేశాల జాబితాలో 8వ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ నేడు ప్రజా నిరసనల హింసాత్మక మంటల్లో వందలాది ప్రాణాలు వదులుతున్నారు. వేల మంది గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఒక్క ఆదివారం 04 ఆగష్టు రోజు మాత్రమే నిరసనకారులు 100లకు పైగా ప్రాణాలు కోల్పోవడం, నిరసనల మంటలు తీవ్ర రూపం దాల్చడం, దేశ మిలటరీ నిరవధిక కర్ఫ్యూ విధించడం వరకు పరిస్థితి దిగజారడం చూసితున్నాం. ప్రభుత్వ కార్యాలయాలు, "అవామీ లీగ్ పార్టీ" కార్యాలయాలు, మంత్రుల నివాసాలు, అధికార పార్టీ బడా నాయకుల ఆస్తులను ధ్వంసం చేయడం, అగ్నికి ఆహుతి ఇవ్వడంతో బంగ్లాదేశ్ అంతటా అల్లర్ల మంటలు చెలరేగుతున్నాయి. ప్రధాని అధికార భవనంలోకి కూడా నిరసనకారులు చొరబడతారనే సమాచారంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దేశ ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి దేశం వదిలి సోమవారం 5 ఆగష్టున పారి పోయారనే తాజా వార్త చక్కర్లు కొడుతున్నది. రెండు పర్యాయాలుగా దాదాపు రెండు దశాబ్దాల పాటు 'అవామా లీగ్ పార్టీ' నేతగా ప్రధానిగా కొనసాగిన 76 ఏండ్ల షేక్ హసీనా నేడు దేశం వదిలి పారి పోయే దుస్థితి చేరడం విచారకరం. 1971లో స్వాతంత్ర్యం పొందిన బంగ్లాదేశ్ నాటి దేశ తొలి ప్రధాని "షేక్ ముజబుర్ రహమాన్" చొరవతో ఫ్రీడమ్ ఫైటర్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా అమలు పరిచయం ప్రారంభించారు. ఇటీవల ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వం తీసుకున్న 'స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు ఉద్యోగాల్లో కోటా'ను ఇప్పుడు కూడా కొనసాగించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకించిన విద్యార్థి ఉద్యమం నేటి హింసాత్మక దుస్థితికి కారణంగా నిలుస్తున్నది. ఉద్యోగాల్లో కోటా కల్పించడమనే నిర్ణయాన్ని దేశ యువత వ్యతిరేకిస్తూ ఆందోళనలు జూన్ 2024లో ప్రారంభించారు. రిజర్వేషన్ కోటాను తొలగించాలనే కోరికతో ప్రారంభమైన ప్రజా ఉద్యమం నేడు తీవ్ర రూపం దాల్చి ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా, షేక్ హసీనా గద్దె దిగాలనే వరకు చేరింది. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు తరతరాలుగా ఉద్యోగాల్లో కోటా కేటాయించడం సముచితంగా లేదని, మెరిట్‌ను దెబ్బ తీసేదిగా ఉందని, అధికార పార్టీ అనుచరులకు లాభం చేకూర్చేదిగా ఉందనే కారణాలతో విద్యార్థిలోకం రోడ్ల వెంట నిరసనల ప్రదర్శనలు చేయడం ప్రారంభించారు. ఈ కోటా వల్ల ప్రభుత్వ సానుభూతిపరులకు మాత్రమే ప్రయోజనం కలుగుతున్నదని, అన్ని ఉద్యోగాల్లో అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు చేరి షేక్ హసీనా ప్రభుత్వానికి గట్టి సపోర్టుగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిరసనల తీవ్రత తగ్గించడానికి విద్యాలయాలను కూడా మూసి వేయడం, ఇంటర్‌నెట్ సేవలను ఆపి వేయడం జరిగింది. ఇటీవల సుప్రీమ్ కోర్టు రిజర్వేషన్ కోటాను రద్దు చేసినప్పటికీ నిరసనలు తగ్గుముఖం పట్టకపోగా రోజు రోజుకు మరింత తీవ్ర రూపం దాల్చి, షేక్ హసీనా ప్రభుత్వం తప్పుకోవాలనే స్థాయికి చేరడంతో ఇప్పటి వరకు 300లకు పైగా మరణాలు నమోదు అయ్యాయి. ప్రస్తుత అల్లర్లు తీవ్ర రూపం దాల్చడానికి, షేక్ హసీనా ప్రభుత్వాన్ని బలహీన పరిచి గద్దె దించడానికి, ప్రతి పక్ష బిఎన్‌పి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పాకిస్థానీ ఐఎస్ఐ ప్రేరేపిత నిషేధిత 'జమాత్-ఇ-ఇస్లామ్' విద్యార్థి సంస్థ బంగ్లా రాజకీయ ఉద్యమానికి పరోక్షంగా సపోర్టు ఇవ్వడం, విధ్వంసకాండను పెంచి పోషించడం కొనసాగుతోంది. ఈ ఉద్యమం రూపు మార్చుకొని అధికారమే పరమావధిగా ఎదురు చూస్తున్న ప్రతిపక్ష రాజకీయ పార్టీల సపోర్టుతో హింసాత్మకంగా మారడం, ప్రాణాలు పోవడం కొనసాగుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఫ్రీడమ్ ఫైటర్స్ కుటుంబాలకు 30 శాతం కోటా అంశాన్ని వ్యతిరేకిస్తూ జూన్/జూలై-2024 మాసాల్లో ఢాకా యూనివర్సిటీ విద్యార్థిలోకం నిరసన ప్రదర్శనలు ప్రారంభించింది. జనవరిలో 5వ దఫా ఏర్పడిన షేక్ హసీనా ప్రభుత్వం తొలుత తేలికగా తీసుకొన్న నిరసనల పర్వం రోజు రోజుకు తీవ్ర రూపం దాల్చుతూ పరిస్థితులు అదుపు తప్పే స్థాయికి చేరడం గమనార్హం. జూలై 16న నిరసన ఉద్యమంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో అల్లర్లు చెలరేగడం ప్రారంభమైంది. జూలై 18న "నియంత షేక్ హసీనా దిగిపోవాలంటూ" నినాదాలు మారుమోగడం, కర్ఫ్యూ విధించినప్పటికీ 32 మంది ప్రాణాలు కోల్పోవడం చూసాం. 21 జూలై రోజున దేశ సుప్రీమ్ కోర్టు రిజర్వేషన్ కోటాను రద్దు చేసినప్పటికీ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు కొనసాగాయి. ఆగష్టు 04 ఆదివారం నిరసనలు, అల్లరులలో 14 మంది పోలీసులతో పాటు దాదాపు 100 మంది మరణించడం జరిగింది. ఈ హింసాత్మక నిరసన అల్లర్లలో ఇప్పటి వరకు దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయారని తెలుస్తున్నది. పూర్వ ఆర్మీ ఛీఫ్, ప్రస్తుత ఆర్మీ ఛీఫ్‌లు ప్రజల పక్షాన నిలుస్తున్నామని ప్రకటించే వరకు పరిస్థితులు దిగజారాయి.

# పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛదనం పచ్చదనం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** మండలం లోని పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాల్లో క్లీన్ చేసి చెట్టు నాటడం జరిగింధని ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్, మాట్లాడుతూ మన యొక్క చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే రోగాల బారిన పడకుండా ఉంటామని అలాగే ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా చెట్లను నాటాలని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల ప్రారంభ సభలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పాకాల శంకర గౌడ్
- సిరిసిల్లలో 8, 9 తేదీలలో రెండు రోజులు ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 7,8 తేదీలలో రెండు రోజులపాటు జిల్లాలో ముఖ్యమైన కార్యకర్తల జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరుగుతున్నాయని జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జిల్లా నలుమూలల నుండి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. శిక్షణ తరగతుల ప్రారంభ సభలో ముఖ్య వ్యక్తులు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్, జెవివి రాష్ట్ర నాయకులు రామరాజు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ముషం రమేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు లు హాజరై మాట్లాడుతూ... విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని పాలకులకు విద్యార్థులే తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.ప్రభుత్వాలు విద్యారంగానికి తగిన నిదువ కేటాయించడం లేదని విద్యార్థులందరు భవిష్యత్తులో సమరసిరా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి శిక్షణ తరగతులు రెండు రోజులపాటు విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద అనిల్, మల్లారపు ప్రశాంత్ ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్ ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి భరత్ ,శివ, రిషి, నవ్య, అక్షయ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి కుక్క స్వైర విహారం

- నలుగురు విద్యార్థుల పై దాడి - సిరిసిల్ల ఏరియాసుపత్రి కి తరలింపు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేటలో గల 14 వ వార్డులో నర్సరీ చదువుకుంటున్న ఐదుగురు విద్యార్థులను పిచ్చి కుక్క గురువారం సాయంత్రం కాటు వేసింది. 14 వ వార్డు కు చెందిన మస్కూరి బ్రిటిష (7) విజ్ఞాన్ స్కూల్ లో రెండవ తరగతి, మస్కురి సహస్ర (6)శ్రీ చైతన్య ఎల్ కే జి విద్యార్థి,ఏర్పుల వరుణ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యుకేజీ, మద్దుల వర్షిత్ రెడ్డి(6) విజ్ఞాన్ స్కూల్ లో ఫస్ట్ క్లాస్ చదువుకుంటున్నారు.పాఠశాల వదిలిపెట్టిన తరువాత బ్రిటిష,సహస్ర, వరుణ్ లు అంతా ఒక చోట కూర్చొని హెూం వర్క్ చేసుకుంటుండగా అటు వైపు వచ్చిన పిచ్చి కుక్క విద్యార్థులను చాల చోట్ల కరిచింది.అక్కడి నుండి వీరిని కరిచిన పిచ్చి కుక్క మెయిన్ రోడ్డు వైపు వెళ్ళి మద్ధుల వర్శిత్ రెడ్డి నీ సైతం కరిచింది. రక్తగాయాలైన దీంతో కంగారు పడిన విద్యార్థులు హెూం వర్క్ చేస్తున్న పుస్తకాలు వదిలిపెట్టి ఎవరి ఇండ్లకు వారు వెళ్లి పొగ వారి తల్లులు నేరుగా ఎల్లారెడ్డిపేటలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తీసుకెళ్లగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారిని 108 అంబులెన్స్ లో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు.



ఈ విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకుని సిరిసిల్ల ఏరియాసుపత్రి లో గల వైద్యులతో ఫోన్లో మాట్లాడి సకాలంలో వైద్య చికిత్స అందించాలని కోరారు. కుక్కలను వెంటనే చంపించాలని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సత్తయ్య ను మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ కోరారు.


# ప్రమోషన్ మరియు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ముస్తాబాద్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవునూరు లో ఇటీవల బదిలీ మరియు ప్రమోషన్లలో వెళ్లిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు గురువారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దికుంట లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు . ప్రమోషన్ లో వెళ్లిన హిందీ ఉపాధ్యాయురాలు లకావత్ ఉమ మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు తడుకల సురేష్ అలాగే బదిలీపై వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ అనురాధ గారికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి వారి సేవలను కొనియాడారు..ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దికుంట లక్ష్మణ్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

- ఎంఆర్ కి వినతిపత్రం ఇచ్చిన బీజేపీ నాయకులు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కోనరావుపేట:** కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల లో నిర్వహించిన ఎస్సి డిక్లరేషన్ లో ఇచ్చిన ప్రధాన హామీలైన అంబేద్కర్ అభయహస్తం,ఎస్సి స్వయం ఉపాధిక రుణాలు,షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునః నిర్మాణం తదితర హామీలను రాష్ట్ర బడ్జెట్ లో ఎలాంటి నిధులను కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ బీజేపీ మండల అధ్యక్షులు గొట్టే రాంచంద్రం, ఎస్సి మోర్చా అధ్యక్షులు ఎర్ర రమేష్ ల ఆధ్వర్యంలో కోనరావుపేట ఎంఆర్వోకి గురువారం వినతిపత్రం సమర్పించారు.. ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలనీ బీజేపీ కోనరావుపేట మండల అధ్యక్షుడు గొట్టె రాంచంద్రం ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మోత్కు మోహన్, ప్రధానకార్యదర్శి బొల్లారం తిరుపతి, బోయిని నర్సయ్య,గంగాధర్ వెలిశాల శేఖర్,కాంత్తయ్య,విజయ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో కానరాని స్వచ్ఛత

## ద్రుష్టి పెట్టని స్పెషల్ ఆఫీసర్లు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** మండలం లోని పలుగ్రామాల్లో విపరీతంగా పెరిగిపోతున్న పిచ్చి మొక్కలు డ్రైనేజీ ల్లో దోమల బెండద రోజురోజుకి విపరీతంగా పెరిగిపోతున్న కాని గ్రామ ప్రత్యేక అధికారులు గ్రామ కార్యదర్శులు సిబ్బంది పిచ్చిమొక్కల పై దోమల నివారణపై దృష్టి సారించాలిసినా అధికారులు ప్రజలు జబ్బులు రోగాల బారిన పడ్డ తరువాత అధికారుల మెప్పుకోసం చేసే ప్రయత్నాలు కాకుండా ప్రజల ప్రాణాలు కాపాడలిసిన బాధ్యత ప్రభుత్వం పై అధికారులపై ఉందని ముందస్తుగా పిచ్చి మొక్కలపై దోమల నివారణపై స్వచ్ఛత పై ద్రుష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రామడుగుకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని డిపిఓ కు వినతి




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రానున్న సర్పంచ్ ఎన్నికల్లో రామడుగు మండల కేంద్రానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని గురువారం డిపిఓ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో సర్పంచ్ వ్యవస్థ ఏర్పడ్డ నుండి ఇప్పటివరకు రామడుగు మండల కేంద్రానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించలేదని దీనితో ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని రామడుగు మండల కేంద్రంతో పాటు గోలి రామయ్య పల్లి దత్తోజుపేట గ్రామాలకు మాత్రమే ఎస్సీ రిజర్వేషన్ కాలేదని ప్రస్తుతం రానున్న సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని మండల కేంద్రంలోని దళిత నాయకులు సంబంధిత డిపిఓ రవీందర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జట్టుపల్లి వీరయ్య కలిగేటి ఎల్లయ్య నాగి శ్రీనివాస్ నెమలికొండ ప్రభాకర్ మాదం చంద్రయ్య కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# కలకలం రేపుతున్న హనీ ట్రాప్


లక్నో : ఓ మహిళ డబ్బు త్వరగా సంపాదించాలని తప్పుడ మార్గాన్ని ఎంచుకుంది. పురుషులతో సన్నిహితంగా ఉండడం.. ఆ తరువాత వారిని బ్లాక్ మెయిల్ చేసి వారి నుంచి భారీగా సొమ్ము వసూలు చేసేది. దీని కోసం ఆమెకు ఒక ప్రత్యేక గ్యాంగ్ ని మెయిన్ టెయిన్ చేస్తోంది. ఈ క్రమంలో ఆమె తన బంధువల ఇంట్లో పెద్ద మొత్తంలో డబ్బులున్నాయని తెలిసి.. ఆ ఇంట్లో తన గ్యాంగ్ తో దొంగతనం చేయింది. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీ లో జరిగింది.బరేలీ సమీపంలోని నకటియా గ్రామంలో ఇటీవల ఒక రోజు రాత్రి షానవాజ్ బానో అనే మహిళ ఇంట్లో నలుగురు ముసుగు దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్నవారిని చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి రూ.15 లక్షలు నగదు, బంగారు నగలు దోచుకొని వెళ్లారు. అయితే దొంగతనం ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు.. సిసిటీవి వీడియోల ఆధారంగా రెండు రోజుల్లోనే ఆ నలుగురిని పట్టుకున్నారు. వీరిలో అర్ష్ సైఫీ ఆ ముఠాకి నాయకుడు. పోలీసులు అతడిని ఎంత ప్రశ్నించినా ? అతను నోరు విప్పలేదు. కానీ ఆ నలుగురిలో రామ్ కశ్యప్ అనే మరో దొంగ ఒక షాకింగ్ విషయం చెప్పాడు.

# మహాలక్ష్మి డిమాండ్ బాగుందిగా...?



బాలీవుడ్ లో సినిమాలు చేస్తూ అక్కడ నుంచి టాలీవుడ్ షిఫ్ట్ అయిన మృణాల్ ఠాకూర్ హిందీలో బుల్లితెర మీద నుంచి సిల్వర్స్ స్క్రీన్ ఆ తర్వాత సౌత్ సినిమాల్లో తన సత్తా చాటుతుంది.తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చి సూపర్ హిట్ అందుకున్న మృణాల్ ఠాకూర్ ఆ సినిమాతో తెలుగు యూత్ ఆడియన్స్ మనసులు దోచేసింది. ఇక ఆ తర్వాత వెంటనే హాయ్ నాన్న సినిమాతో మరో సక్సెస్ అందుకుంది. మృణాల్ ఠాకూర్ థర్డ్ సినిమా ది ఫ్యామిలీ స్టార్ మాత్రం నిరాశ పరిచింది. ఐతే అమ్మడు తన నెక్స్ట్ సినిమా భారీ ఆఫర్ అందుకుందని తెలుస్తుంది. ప్రభాస్ హను రాఘవపుడి కాంబో సినిమాలో మృణాల్ నటిస్తుందని టాక్. ఐతే ఈ సినిమా లో నటించేందుకు గాను అమ్మడు బ్లాస్టింగ్ రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తుందని తెలుస్తుంది. అంటే దాదాపు ఇప్పుడు మృణాల్ ఒక సినిమాకు తీసుకునే రెమ్యునరేషన్ కన్నా అది డబుల్ అని టాక్. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. సినిమా బడ్జెట్ కోసమే 300 కోట్ల దాకా పెట్టబోతున్నారని టాక్. ఐతే అందులో ప్రభాస్ రెమ్యునరేషన్ 100 కోట్ల పైన ఉండబోతుందట. హీరోయిన్ మృణాల్ కి కూడా 8 కోట్ల దాకా అందిస్తున్నారని టాక్. మృణాల్ కి బాలీవుడ్ లో కూడా క్రేజ్ ఉంది కాబట్టి అక్కడ ఇక్కడ ఆమె ఇమేజ్ ఉపయోగపడుతుందని అమ్మడికి భారీ రెమ్యునరేషన్ ఇచ్చి తీసుకుంటున్నారు.

# సమంతపై శోభిత పాత వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్



నాగ చైతన్య అక్కినేని శోభిత ధూళిపాళతో ఈరోజు ఉదయం హైదరాబాద్‌లో నిశ్చితార్థం జరిగింది. నాగార్జున సోషల్ మీడియాలో ఈ వార్తలను అధికారికంగా ధృవీకరించారు మరియు ఈవెంట్ నుండి చిత్రాలను పంచుకున్నారు. ఈ సందర్భంలో, శోభిత యొక్క పాత వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది, అక్కడ ఆమె సమంత మరియు నాగ చైతన్య గురించి మాట్లాడింది. ది నైట్ మేనేజర్ సిరీస్ ప్రమోషన్స్ సందర్భంగా, బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కొంతమంది నటీనటులపై తన అభిప్రాయాలను పంచుకోమని శోభితను అడిగారు. సమంత గురించి శోభితను అడిగినప్పుడు, ఆమె ఇలా చెప్పింది, “ఆమె ప్రయాణం చాలా బాగుంది. మీరు ఆమె ఫిల్మోగ్రఫీని చూస్తే, ఆమె ఒక ప్రాజెక్ట్‌ను హెడ్‌లైన్ చేసే విధానం నిజంగా బాగుంది. నాగ చైతన్య గురించి మాట్లాడమని అడిగినప్పుడు, ఆమె మాట్లాడుతూ, “అతని స్వభావం బాగుందని నేను భావిస్తున్నాను. అతను చాలా కూల్ హెడ్డ్, ప్రశాంతత మరియు గౌరవప్రదమైన వ్యక్తిలా కనిపిస్తాడు. నేను నిజం గా ఇది అభినందిస్తున్నాను.” శోభిత మరియు నాగ చైతన్య కలిసి నటించలేదు కానీ ఈ జంట బాగా కలిసింది. మీడియాలో వారి సంబంధం గురించి పుకార్లు ఉన్నాయి, కానీ చివరకు అది జరిగే వరకు ఈ జంట ఎప్పుడూ బహిరంగపరచలేదు.

# బోల్డ్, బ్యూటిఫుల్ మరియు బ్లాక్: కృతి సనన్ యొక్క ఫిల్మ్‌ఫేర్ కవర్




కృతి సనన్, 'క్రూ' మరియు 'తేరీ బాటన్ మే ఐసా ఉల్జా జియా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌లకు పర్యాయపదంగా మారిన పేరు, ఈసారి ఫిల్మ్‌ఫేర్ కవర్‌పై తన సిజ్లింగ్ అవతార్‌తో హృదయాలను దోచుకుంది. తన నటనతో ప్రశంసలు అందుకుంటున్న ఈ నటి, ఇప్పుడు తన హాట్ లుక్‌తో ఆకట్టుకుంది. మ్యాచింగ్ స్కర్ట్‌తో జత చేసిన కిల్లర్ బ్లాక్ బ్రాలెట్ ధరించి, కృతి కాదనలేని సెక్స్ అప్పీల్‌ను వెదజల్లుతుంది. చంకీ నెక్లెస్ మరియు బోల్డ్ బ్యాంగిల్స్ వంటి స్టేట్‌మెంట్ మేకింగ్ యాక్సెసరీలతో సమిష్టి ఎలివేట్ చేయబడింది, ఇది ఇప్పటికే అద్భుతమైన రూపానికి గ్లామర్‌ని జోడిస్తుంది. ఆమె కెమెరాను అప్రయత్నంగా సొంతం చేసుకోవడంతో నటి విశ్వాసం ప్రకాశిస్తుంది, పరిశ్రమలో ఆమె ఎందుకు లెక్కించాల్సిన శక్తి అని మరోసారి రుజువు చేస్తుంది.

# OTT టాక్ - సమంత తర్వాత త్రిష!

గత నాలుగు సంవత్సరాలుగా, అనేక మంది దక్షిణ భారత చలనచిత్ర స్టార్ నటీమణులు వివిధ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో డిజిటల్ రంగ ప్రవేశం చేసారు, అయితే సమంత & తృష్ణ కృష్ణన్ మాత్రమే గుర్తుండిపోయే వెబ్ సిరీస్‌లను అందించగలిగారు. ఇప్పటివరకు డిజిటల్ రంగ ప్రవేశం చేసిన ఆరు-నక్షత్రాల నటీమణులలో, తమన్నా భాటియా ఇప్పటివరకు నాలుగు వెబ్ సిరీస్‌లలో (11వ అవర్, నవంబర్ స్టోరీ, జీ కర్దా & ఆఖ్రీ సచ్) నటించారు, అయితే ఏ ఒక్క షో కూడా ఎక్కువ కాలం ప్రభావం చూపలేదు. తమన్నా మితిమీరిన స్కిన్ షో కారణంగా సోషల్ మీడియాలో కొంత సందడి చేసిన జీ కర్దా. 'లైవ్ టెలికాస్ట్'తో కాజల్ అగర్వాల్, 'షోటైమ్'తో శ్రియా శరణ్ మరియు 'బెస్ట్ సెల్లర్'తో శృతి హాసన్ మర్చిపోలేని వెబ్ సిరీస్‌లలో అడుగు పెట్టారు. మూడు షోలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో ఘోరంగా విఫలమయ్యాయి. మొత్తం ఆరుగురు నటీమణులలో, సమంతా రూత్ ప్రభు 'ది ఫ్యామిలీ మ్యాన్ - సీజన్ 2'తో బ్లాక్ బస్టర్ డిజిటల్ రంగ ప్రవేశం చేసింది. ఈ కార్యక్రమం భారీ విజయాన్ని అందుకుంది మరియు డిజిటల్ రంగంలో అత్యంత డిమాండ్ ఉన్న నటిగా సమంతను చేసింది. ఆమె రెండవ వెబ్ సిరీస్, ఎక్కువగా ఎదురుచూస్తున్న స్పై థ్రిల్లర్, సిటాడెల్: హనీ బన్నీ, అమెరికన్ సిరీస్, సిటాడెల్‌కి స్పిన్-ఆఫ్, 07 నవంబర్ 2024న ప్రైమ్ వీడియోలో విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. సమంతా తర్వాత డిజిటల్‌గా అరంగేట్రం చేయగలిగింది తృష్ణ కృష్ణనే. సోనీ లివ్‌లో ఒక వారం క్రితం విడుదలైన ఆమె మొదటి వెబ్ సిరీస్ బృందా, విమర్శకులు మరియు సాధారణ ప్రేక్షకుల నుండి చాలా మంచి సమీక్షలను అందుకుంది. క్రైమ్-థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లో త్రిష సంయమనంతో కూడిన నటనకు మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. మీరు పైన పేర్కొన్న ప్రతి వెబ్ సిరీస్‌ని చూడగలిగే స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్ వివరాలు క్రింద ఉన్నాయి.

